జయమ్మను వీడిన గంగమ్మ



అడుగంటిన బోరుబావులు


- ఎండిపోయిన వరి, దెబ్బతిన్న కర్బూజ
- రూ. ఆరు లక్షల పెట్టుబడి నష్టం
- కన్నీరుమున్నీరవుతున్న మహిళా రైతు



జయమ్మ సాగుచేసిన కర్బూజా

బోరుబావిలో పుష్కలంగా నీరు వస్తున్నాయని ఆ మహిళా రైతు అప్పు చేసి పంటలు సాగు చేసింది. తెగుళ్ల బారి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంది. అయితే హఠాత్తుగా బోరుబావిలో నీరు తగ్గిపోయింది. దీంతో పంటలు ఎండిపోయాయి. లక్షల రూపాయల అప్పులు మాత్రం మిగిలాయి. దీంతో ఎలా బతికేది భగవంతుడా అని ఆమె దీనంగా రోదిస్తోంది.

\- ఆంధ్రజ్యోతి, ధర్మవరం రూరల్



బోరులో అరకొరగా వస్తున్న నీరు

ధర్మవరం మండలంలోని దర్శినమల గ్రామానికి చెందిన మహిళ రైతు కొడిగ జయమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త తిక్కనారాయణస్వామి 25ఏళ్ల కిందటే మృతిచెందాడు. దీంతో కుటుంబ భారం జయమ్మ మీద పడింది. అయినా వెరవక వ్యవసాయం చేస్తూనే ముగ్గురు పిల్లలను పెంచి పెద్ద చేసి, పెళ్లిళ్ల చేసింది. జయమ్మకు ఐదెకరాల వ్యవసాయ తోట ఉంది. అందులో రెండు బోరు బావులు ఉన్నాయి. ఒక బోరు ఇంకిపోవడంతో మరో బోరు ద్వారా పంటలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. బోరు బావిలో రెండు ఇంచుల నీరు వస్తుండటంతో 3.5ఎకరాలలో కర్బూజా పంట, 1.5ఎకరాలో వరి సాగు చేశారు. 20 రోజుల కిందట నుంచి ఉన్నఫలంగా బోరు బావిలో నీరు తగ్గిపోయింది. ఎండల తీవ్రత పెరగడంతో రోజు రోజుకూ భూగర్భజలం మట్టం పడిపోయింది. ఇప్పటికే పంటల సాగుకోసం జయమ్మ సుమారు రూ.6లక్షల దాకా పెట్టుబడి పెట్టారు. నీరు పారక వరి పూర్తిగా ఎండిపోయింది. కర్బూజా కాయలన్నీ పగిలిపోతున్నాయి. కొనుగోలు చేసేందుకు కూడా వ్యాపారులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఉందని, మళ్లీ బోరు వేయడానికి అప్పులు పుట్టలేదని తాము ఎలా బతికేదంటూ ఆ మహిళ రైతు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం, అధికారులు కరుణించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



ఎండిపోయిన వరిపంట, నీళ్లు లేక బీటలు బారిన పొలం



కర్బూజా కాయలను చూపుతున్న రైతు జయమ్మ

అయ్యో పనేనా..?

సిఫార్సు లేఖల కోసం డ్వామా ఉద్యోగుల ప్రదక్షిణ

కంప్యూటర్ ఆపరేటర్ నుంచి ఏపీడీ వరకు ప్రయత్నాలు

వైసీపీ పాలనలో అరాచకాలపై అధికార పార్టీ నాయకుల ఆరా

ఎట్టకేలకు డ్వామాలో బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సంబంధిత ఉద్యోగులు సిఫార్సు లేఖల కోసం అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మినహా మిగతా సిబ్బందిని మార్చడానికి ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లా స్థాయిలో డ్వామా పరిధిలో పనిచేసే అన్ని విభాగాల అధికారులను బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రెండు, మూడు రోజులుగా ఆ శాఖలోని ఉద్యోగులు మండల స్థాయి నాయకుల నుంచి నియోజకవర్గ స్థాయి నాయకులను ప్రసన్నం చేసుకొనేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

\-ఆంధ్రజ్యోతి, హిందూపురం



కోరుకున్న స్థానం కోసం

డ్వామాలో బదిలీ నేపథ్యంలో కోరుకున్న మంచి స్థానం కోసం పలువురు ఉద్యోగులు సిఫార్సు లేఖల కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గత రెండు రోజులుగా ఎమ్మెల్యేల కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. అయితే వైసీపీ హయాంలో పనిచేసిన అధికారుల పనితీరు, వారి వ్యవహార శైలిని అక్కడ ఆరా తీస్తూ సిఫార్సు లేఖలను ఇవ్వడానికి సంకోచిస్తున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో కొంత మంది సిబ్బంది చోటా మోటా నాయకులను ప్రసన్నం చేసుకుంటూ తమ పనిని చక్కబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరు స్థాన చలనం జరగకుండా ఉండే చోటే ఉండటానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే ఇప్పటికే ఆ శాఖలో వైసీపీకి అనుకూలంగా పనిచేసిన అధికారుల జాబితా సిద్ధ మైనట్లు తెలిసింది. దానికి అనుగుణంగానే సిఫార్సు లేఖలు ఇవ్వాలని నాయకులు ఆలోచిస్తున్నట్లు తెలిసింది.



హిందూపురంలోని డ్వామా కార్యాలయం

ముమ్మర ప్రయత్నాలు

జిల్లాలోని పలు మండలాల్లో పని చేస్తున్న ఏపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లు తమకు కావాల్సిన మండలం కోసం ప్రయత్నం ముమ్మరం చేశారు. ముఖ్యంగా ఏపీడీలు వారి కార్యాలయాల్లో పనిచేసే ఆపరేటర్లు శిక్షణా కేంద్రంలో పనిచేసే క్లస్టర్ కోర్సు డైరెక్టర్ల స్థానాల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నట్లు తెలిసింది. హిందూపురం, పెనుకొండ నియోజక వర్గాల్లో ఏపీఓ పోస్టుల కోసం తీవ్రంగా పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు కూడా పైరవీలు పెరిగాయి. ప్రస్తుతం డ్వామాకు నిధులు విరివిగా తీసుకు రావాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీంతో కోరుకున్న చోటు దక్కితే అన్ని రకాలుగా అనుకూలంగా ఉంటుందని పలువురు సిబ్బంది, అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనుకూలమైన స్థానం కోసం ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నారు.

భేష్

ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదంపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హర్షం



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఇతర ప్రజా ప్రతినిధులు

మడకశిరటౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణను కేబినెట్‌లో ఆమోదించడం హర్షనీయమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. వెలగపూడిలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంగా రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్‌రంజాన్ మిశ్రా కమిషన్ వేసింది. అన్ని కులాల, ఉపకులాల అంగీకారం మేరకు వర్గీకరణపై రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఆనాడు బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా, ప్రతిభా భారతిని ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్నత పదవుల్లో నియమించి గౌరవం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. 30 ఏళ్ల దళితుల పోరాటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సముచిత గౌరవాన్ని ఇచ్చారని ప్రశంసించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

శాసనసభలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపాఠశాలల్లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పార్ట్‌టైం ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ ఇవ్వాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో మంగళ వారం ఆమె కాంట్రాక్టు ఉద్యోగులు, సాంఘిక సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సాంఘిక సంక్షేమపాఠశాలల్లో పనిచేసే వారికి ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. 010పద్దు ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. పాఠశాలల్లో 779 మంది కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్నా రని, అర్హతలున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ పాఠశాలల్లో పని చేస్తున్న 200 మంది పార్ట్‌టైం ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్ చెల్లించాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన మంత్రి బాలవీరాంజనేయులు మాట్లాడు తూ 010 అంశాన్ని ఒకసారి ఆర్థిక శాఖ పరిధిలో తిరస్కరించారని, మరోసారి ప్రభుత్వ పరిశీలనకు పంపుతావున్నారు. కాంట్రాక్టు ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణలో ప్రభుత్వ పాలసీ మేరకు నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.35 (బుధవారం సాయంత్రం)

సెహరీ : 5.03 (గురువారం ఉదయం)

కదిరి యువకుడి ప్రతిభ

బాడీ బిల్డింగ్ పోటీల్లో రెండు పతకాలు



బాడీ బిల్డింగ్ పోటీల్లో షీల్డుతో యువకుడు రమేష్

కదిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో కదిరి పట్టణానికి చెందిన రమేష్ రెండు పతకాలు సాధించారు. తిరుపతి జిల్లా సూళ్లూరు పేటలో మిస్టర్ ఆంధ్ర బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో మాస్టర్ కేటగిరి విభాగంలో, 75కేజీల విభాగంలో రమేష్ తృతీయ స్థానం సాధించాడు. ఆదివారం జరిగిన పోటీల్లో తాను రెండు పతకాలు సాధించినట్లు రమేష్ చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం, దేశంలో జరిగే పోటీల్లో మరిన్ని పతకాలు తేవడానికి కృషి చేస్తానన్నారు.

అందుబాటులో ఉచిత ఇసుక: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

పుట్టపర్తిటౌన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులందరికీ ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో జేసీ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్నతో కలిసి మంగళవారం ఆయన డీఎల్ఎస్ఈ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. ఇసుక డంపింగ్ యార్డులను ఆర్డీవోలు 15రోజులకు ఒకసారి పరిశీలించి, సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని డంపింగ్ యార్డుల్లో సీసీ కెమేరాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. అక్రమ రవాణా జరగకుండా మండల స్థాయిలో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, మైనింగ్, జలవనరులు, పర్యావరణా శాఖాధికారులున్నారు.

తప్పుల్లేకుండా ఆధార్ నమోదు

ఆధార్ నమోదులో తప్పులకు తావుండరాదని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కోర్టు హాల్ సమావేశ భవనంలో ఆధార్‌న మోదుపై జిల్లా కమిటీతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు వైద్యాఆరోగ్యం, ఐసీడీఎస్, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆధార్ నమోదు కేంద్రాల్లో చేయాలన్నారు. జన్మించిన శిశువులకు ఆధార్ నమోదుకు పుట్టిన తేదీని తప్పనిసరి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఇంకా 54,013మంది ఐదేళ్లలోపు పిల్లలు ఆధార్ నమోదు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఆధార్ నమోదు కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, డిఇఓ క్రిష్టప్ప, ఐసిడిఎస్ అధికారులున్నారు.

చిన్న ఆశ
ఉద్యోగ భద్రత కోసం ఆరోగ్యమిత్రల ఎదురుచూపు
6

బియ్యం అక్రమ రవాణా అరికట్టాలి: జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్


పుట్టపర్తి టౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పేదలకు అందిస్తున్న చౌకబియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లాలోని సీఎస్‌డీటీ లు కఠిన చర్యలు తీసుకోవాలని జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ భవనంలో జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థలపై సీఎస్‌డీటీలు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని సీఎస్‌డీటీలు, చౌక ధాన్యం అక్రమ రవాణాను అరికట్టడానికి వారి పరిధిలోని స్టోర్లను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. ప్రతినెలా ఒక్కో సీఎస్‌డీటీ 20 చౌకధరల దుకాణాలను పరిశీలించి, నివేదికలు అందించాలన్నారు. అలాగే గ్యాస్ ఏజెన్సీలను నిరంతరం తనిఖీ చేస్తూనే ప్రజాభిప్రాయాలను సేకరించాలన్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదు వస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

కౌలు కష్టాలు



సీసీఆర్‌సీ కార్డుల జారీ తీరిదీ..

సంవత్సరం	జారీ చేసిన కార్డుల సంఖ్య
2019 - 20	2160
2020 -21	831
2021 -22	2022
2022- 23	2149
2023-24	6960
2024-25	8382



కొందరికే గుర్తింపు కార్డులు

అనంతపురం అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కౌలు రైతు కష్టాలు వర్ణనాతీతం. కౌలు కట్టుకుంటాడు. సేద్యం పనులన్నీ స్వంతంగా చేసుకుంటాడు. పంట దెబ్బతింటే పెట్టుబడి, ఆరుగాలం శ్రమ, కౌలు డబ్బు సర్వం నష్టపోతాడు. అలాంటి నిసలైన రైతుకు అడుగడుగునా అన్యాయం వాటిల్లుతోంది. కనీసం గుర్తింపు దక్కట్లేదు. ప్రభుత్వ పథకాలు కూడా వర్తింపజేయకపోవడం శోచనీయం. అనంత కౌలు రైతును ఆదుకోవడంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఏటా కౌలు రైతులకు నిబంధనల పేరుతో పంటల సాగుదారుల హక్కు (సీసీఆర్‌సీ) కార్డుల జారీలో కొర్రీలు పెడుతున్నారు. అరకొరగా సీసీఆర్‌సీ కార్డులు అందుకున్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి తగిన పథకాలు వర్తింపజేయడం లేదు. బ్యాంకులు సైతం రుణాలు అందించడంలో తీవ్ర అశ్రద్ధ చూపుతున్నాయి. జిల్లాలో 30వేల మందికిపైగా కౌలు రైతులున్నట్లు అధికార వర్గాల సమాచారం. ఏటా అరకొరగానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంతో సరిపెడుతున్నారు. వైసీపీ హయాంలో కార్డులు అందుకున్న వారిలో సగంమందికి మాత్రమే రైతు భరోసా డబ్బు జమ చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ సొమ్మును ఒక్క కౌలు రైతుకు కూడా మంజూరు చేయకపోవడం గమనార్హం. సీసీఆర్‌సీ కార్డున్నా ప్రభుత్వ పథకాలు వర్తించకపోవడంతో బాధిత కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. కౌలు భూమిలో పంటలు సాగు చేసి, పంట నష్టం వాటిల్లినా రైతులకు పరిహారం వర్తింపజేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. వచ్చే ఖరీఫ్ నుంచైనా అర్హత కలిగిన కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి, రైతు భరోసా, పీఎం కిసాన్, పంటనష్టపరిహారం, పంటల బీమా వర్తింపుతోపాటు బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- అరకొరగా సీసీఆర్‌సీ కార్డుల జారీ
- 2024-25లో 68మందికే బ్యాంకు రుణాలు
- గత ప్రభుత్వం తెచ్చిన నిబంధనలతో ఇక్కట్లు
- రైతు భరోసా, ప్రభుత్వ పథకాల వర్తింపుపై నిర్లక్ష్యం
- వచ్చే ఖరీఫ్ నుంచైనా న్యాయం చేయాలని వేడుకోలు

నిబంధనలతో ఇక్కట్లు

గత వైసీపీ సర్కారు 2019లో పంటల సాగుదారుల హక్కు చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ఈ చట్టంలో భూమి యజమాని అంగీకారం ఉంటేనే కౌలు రైతుకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలన్న నిబంధన పెట్టారు. తమ భూమి కౌలుకు తీసుకునే రైతులకు అంగీకారపత్రం రాసిస్తే తమకు ప్రభుత్వ పథకాలు వర్తించవన్న కారణంతో భూమి యజమానులు సంతకం పెట్టేందుకు వెనుకంజ వేస్తున్నారు. అంగీకార పత్రం అడిగితే కౌలు రద్దు చేస్తామంటూ షరతులు పెట్టారు. దీంతో నిజమైన కౌలు రైతులకు అన్యాయం వాటిల్లుతోంది. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కౌలు రైతుల రక్షణ కోసం ఏపీ భూ అధీకృత రైతుల చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ చట్టం మేరకు భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కౌలు రైతులను గుర్తించేది. సంబంధిత అధికారులు.. గ్రామసభలు ఏర్పాటు చేసి, అసలైన కౌలు రైతులను గుర్తించి, కార్డులు జారీ చేసేవారు. 2014-19 మధ్యకాలంలో కౌలు రైతులకు రుణ మాఫీని వర్తింపజేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు పాత చట్టాన్ని రద్దు చేసింది. కొత్త చట్టం మేరకు కౌలు రైతులకు గతంలో కంటే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని అప్పటి పాలకులు ఆర్భాటంగా ప్రకటించారు. భూయజమాని సంతకం తప్పనిసరి చేయడంతో కౌలు రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. జిల్లాలో దేవదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయడం లేదు. దీంతో పంట నష్టం వాటిల్లితే ఆయా కౌలు రైతులు ప్రభుత్వ లబ్ధికి దూరమవుతున్నారు. వైసీపీ సర్కారు తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేసి, భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

అర్హులందరికీ సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలి



జిల్లాలో కౌలు రైతులకు అరకొరగా సీసీఆర్‌సీ కార్డుల జారీతో అధికారులు సరిపెడుతున్నారు. ఇప్పటిదాకా 68 మందికి మాత్రమే బ్యాంకు రుణం ఇవ్వడం దారుణం. సీసీఆర్‌సీ కార్డులున్న రైతులకు బ్యాంకు రుణం ఇవ్వడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచైనా అర్హత కలిగిన ప్రతి రైతుకు సీసీఆర్‌సీ కార్డులు అందజేసి, బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-రంగారెడ్డి, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

68 మందికే బ్యాంకు రుణం

2024-25 సంవత్సరంలో 8,382 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు. వీరిలో 1,741 మందికి రుణ మంజూరుకు అర్హత ఉన్నట్లు ఎస్ఎల్‌బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ) గుర్తించింది. 2024-25 ఖరీఫ్‌లో 68 మందికి రూ.39.55 లక్షల బ్యాంకు రుణం మంజూరు చేయడంతో సరిపెట్టారు.

ఆ చట్టాన్ని రద్దు చేయాలి



భూయజమాని సంతకం ఉంటేనే సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలంటూ వైసీపీ సర్కారు తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి. పాత పద్ధతిలోనే భూయజమాని సంతకం అవసరం లేకుండానే అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేసి, కౌలు రైతులను గుర్తించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కార్డులు జారీచేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కౌలు రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్, బ్యాంకు రుణాలు, పంటనష్టపరిహారం, పంటల బీమా తదితర పథకాలను వర్తింపజేయాలి. దేవదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి, ఆదుకోవాలి.

- బాలరంగయ్య, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి



అటవీ శాఖాధికారుల మెడకు నకిలీ చలానాల ఉచ్చు

నోడ్యూస్ జారీ చేయని ఉన్నతాధికారులు

రిటైర్మెంట్ సమయంలో తిప్పలు

రికవ్రీ..!

అటవీశాఖ జిల్లా కార్యాలయం



అటవీ శాఖాధికారుల మెడకు నకిలీ చలానాల ఉచ్చు బిగుసుకుంది. ఉద్యోగ విరమణ సమయంలో సమస్యలు తెచ్చిపెట్టింది. స్వాహా అయిన సొమ్ము రికవరీ అయ్యేవరకు నోడ్యూస్ జారీ చేయమని ఉన్నతాధికారులు తేల్చి చెబుతున్నారు. దీంతో సంబంధిత అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. -ఆంధ్రజ్యోతి, అనంతపురం న్యూటౌన్

అక్రమాల పర్వం ఇలా..?

అటవీశాఖ జిల్లా కార్యాలయంలోని అనంతపురం రేంజ్ పరిధిలో గతంలో అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తాయి. అటవీశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడిన వారిని పట్టుకుని, జరిమానా వేసి, ఆ సొమ్ము చలానాల రూపంలో ప్రభుత్వానికి చెల్లించేలా ఫైల్ రెడీ చేసి పంపారు. సొమ్ము కట్టించుకునే కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేసు వివిధ అకౌంట్లకు ఫోన్ పే ద్వారా సొమ్ము మళ్లించుకుని, నకిలీ చలానాలతో స్వాహా చేస్తూ వచ్చాడు. కార్యాలయంలోని సిబ్బందిని మామూళ్లతో మేనేజ్ చేశాడన్న ఆరోపణలున్నాయి. అలా 2019 నుంచి 2023 వరకు రూ.15 లక్షలుపైగా జేబులోకి వేసుకున్నాడు. ఆడిటింగ్‌లో ఈ అక్రమం వెలుగులోకి వచ్చింది. దీంతో వెంకటేసుపై పోలీసులకు ఫిర్యాదు చేసి, జైలుకు పంపారు. గుత్తి, అనంతపురం రేంజ్‌లలో అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. ఆ సమయంలో గుత్తిరేంజ్ ఎఫ్ఎస్ఓగా కొనసాగి ప్రస్తుతం ముదిగుబ్బలో పనిచేస్తున్న ఐజాక్‌బాబు ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయనకు నోడ్యూస్ సర్టిఫికెట్ జారీ చేయకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అప్పట్లో గుత్తి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పనిచేసిన అయూబ్ బాషా పేరున కూడా మూడు నకిలీ చలానాలు వెలుగుచూశాయి. ఆయన చనిపోవడంతో కుటుంబీకులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగావకాశం కల్పించారు. అప్పట్లో ఆత్మకూరు సెక్షన్ ఆఫీసర్‌గా ఉండి ప్రస్తుతం కుప్పం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (డీఆర్వో)గా ఉన్న పుల్లయ్య, ప్రస్తుతం అనంతపురం రేంజర్ శ్రీనివాసులు జూన్‌లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. వీరికి కూడా నోడ్యూస్ ఇచ్చే అవకాశం లేదు. అప్పట్లో రేంజర్‌గా ఉన్న సూర్యచంద్రరాజు ప్రస్తుతం డోన్ సబ్‌డీఎఫ్‌ఓగా ఉన్నారు. ధర్మవరం డీఆర్వోగా ఉండి శ్రీశైలానికి రేంజర్‌గా బదిలీ అయిన రామకోటికి నోడ్యూస్ సమస్యలు తప్పేలా లేవు. ఇప్పటికే సూపరింటెండెంట్ నుంచి రికవరీకి సంబంధించి సమాచారం అందినట్లు తెలిసింది.





డీఎఫ్‌ఓకి సమస్యలు చెప్పుకుంటున్న సిబ్బంది (ఫైల్)

త్వరగా సమస్య పరిష్కరిస్తాం

స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేసి తీరుతాం. అందులో భాగంగానే నోడ్యూస్ జారీ చేయకుండా పెండింగ్ పెడుతున్నాం. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం. అక్రమాలకు పాల్పడిన వారి నుంచి సొమ్ము రాబట్టేందుకు చర్యలు చేపడుతున్నాం.

- విఘ్నేష్, జిల్లా అటవీ శాఖాధికారి

చాలీ చాలని జీతంతో నెట్టుకొస్తున్న వైనం • నూతన ప్రభుత్వంలోనైనా సమస్యలు తీరేనా?

ఉద్యోగ భద్రత కోసం ఆరోగ్యమిత్రల ఎదురుచూపు

చిన్న ఆశ

ఉద్యోగ భద్రత కోసం ఆరోగ్య మిత్రలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 200 మంది దాకా ఆరోగ్యమిత్రలు ఉన్నారు. ప్రభుత్వాలు అరకొర జీతమే ఇస్తున్నా వీరు మాత్రం దండిగా ప్రజాసేవ చేస్తున్నారు. గత ప్రభుత్వ చర్యలతో వీరి ఉద్యోగ జీవితం దిన దిన గండంగా గడిచింది. - ఆంధ్రజ్యోతి, ధర్మవరం

ఆరోగ్య మిత్రలు ఏం చేస్తారంటే..

ప్రతిరోజు తమకు కేటాయించిన ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తారు. చికిత్స కోసం వచ్చే రోగుల పేర్లను రిజిస్టర్ చేసి, వారిని సంబంధిత డాక్టర్ వద్దకు తీసుకెళతారు. పరీక్షల అనంతరం వారి వివరాలు రికార్డుల్లో పొందుపరిచి, ఏఏ మందులు ఎలా వాడాలి? ఇంటికి వెళ్లిన తరువాత ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతారు. రోగి ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి డిశ్చార్జి అయ్యేవరకు బాధ్యతంతా ఆరోగ్యమిత్రదే.

ప్రక్షాళన పేరుతో ఇబ్బందులు



గత వైసీపీ ప్రభుత్వం ప్రక్షాళన పేరుతో ఆరోగ్యమిత్రలను తీవ్ర ఇబ్బంది పెట్టినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రూ.13500లే జీతమిస్తూ వెట్టి చాకిరీ చేయించారనే విమర్శలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం పొమ్మన లేక పొగ పెట్టింది. జిల్లాలో పని చేసే ఆరోగ్య మిత్రలందరినీ మరో జిల్లాకు బదిలీ చేసింది. వారిస్థానంలో సచివాలయ ఏఎన్ఎంలకు బాధ్యతలు అప్పగించాలని కుయుక్తులు పన్నారు. తమకు అన్యాయం జరుగుతోందని గొంతెత్తినా పట్టించుకునేవారు లేకుండాపోయారు. ఎన్నికలు రావడంతో ఆరోగ్యమిత్రలు ఊపిరిపీల్చుకున్నారు.

కొత్త ప్రభుత్వంపై ఆశ

ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వంపై ఆరోగ్య మిత్రలు కొండంత ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగ భద్రతతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు ఇస్తున్న మాదిరిగా కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తోంది. ఇటీవల ఆరోగ్య మిత్రలందరూ ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ప్రధానంగా ఆరోగ్యమిత్రలను పర్మినెంట్ ఉద్యోగులుగా చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగ్గ వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ చాంబర్ (ఫైల్)

వసతిగృహాలకు రూ.1.73 కోట్ల బకాయి

బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇబ్బందులు

సొంత డబ్బుతో కొనాల్సిందేనా..?

కాస్మెటిక్స్ కష్టాలు..!

సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కాస్మెటిక్స్ కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సకాలంలో కాస్మెటిక్స్ చార్జీలు అందక నానా అవస్థలు పడ్డారు. సంవత్సరానికిపైగా చార్జీలు అందక విద్యార్థులు సొంతఖర్చులతో కాస్మెటిక్స్ కొనుగోలు చేసి కాలం నెట్టుకొచ్చారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ కాస్మెటిక్ చార్జీలు అందించడంలో అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి సుమారు రూ. 1.73 కోట్లు కాస్మెటిక్ చార్జీలు విద్యార్థుల ఖాతాలకు జమ కావాల్సి ఉంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

ఎస్సీ కార్పొరేషన్



రూ. 1.73 కోట్లు బకాయి

అన్ని వసతి గృహాలకు సంబంధించి విద్యార్థులకు కాస్మెటిక్స్ చార్జీలు మొత్తం రూ.1.73 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. బీసీ సంక్షేమశాఖ పరిధిలోని వసతిగృహాలకు ఏడాదిగా కాస్మెటిక్స్ చార్జీలు అందడంలేదు. జిల్లాలో 58 బీసీ హాస్టళ్లు ఉండగా... 8027 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరందరికి దాదాపు 2024 నుంచి కాస్మెటిక్స్‌కు బడ్జెట్ కేటాయించలేదు. ప్రీమెట్రిక్ హాస్టళ్లకు 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ కాస్మెటిక్స్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రీమెట్రిక్ హాస్టళ్లకు రూ. 87.72 లక్షలు నిధులురావాల్సి ఉంది. పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు 2024 ఫిబ్రవరి నెల నుంచి కాస్మెటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ హాస్టళ్లల్లో విద్యార్థులకు రూ. 65.81 లక్షలు బకాయి ఉంది. ఎస్సీ సంక్షేమశాఖకు జిల్లాలో 58 ఎస్సీ హాస్టళ్లు ఉండగా... 5791 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించి 2024 అక్టోబరు నుంచి ఇప్పటి వరకూ కాస్మెటిక్ చార్జీలు రావాలి. వీటికి సంబంధించి రూ.18 లక్షలు పెండింగ్‌లో పడిపోయాయి. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి జిల్లాలో ఐదు వసతిగృహాల్లో 200 మందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ హాస్టళ్లకు సంబంధించి గత ఏడాది డిసెంబరు నుంచి రూ. 2.79 లక్షల కాస్మెటిక్ చార్జీలు రావాల్సి ఉంది.

బడ్జెట్ వచ్చింది



కాస్మెటిక్ చార్జీలకు సంబంధించి రూ. 1.52 కోట్లు బడ్జెట్ వచ్చింది. గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ బడ్జెట్ వచ్చింది. త్వరలోనే విద్యార్థుల ఖాతాలకు నగదు జమ అవుతుంది.

- కుష్బూకొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ

బడ్జెట్ ఉంటే... టోకెన్లు రావు...

సంక్షేమ వసతిగృహాల్లో డైట్ బిల్లులు, కాస్మెటిక్ చార్జీల పరిస్థితి అయోమయంగా తయారయింది. ఒక శాఖకు బడ్జెట్ వస్తే... టోకెన్ నంబర్లు రావు.. మరో శాఖకు టోకెన్ నంబర్లు వస్తే.. ట్రెజరీలో బిల్లులు పెండింగ్‌లో పడిపోతాయి.. మరోశాఖలో బడ్జెట్, టోకెన్ నంబర్లు, ట్రెజరీ తతంగమంతా ముగిసినా... ఆర్‌బీఐ నుంచి క్లియరెన్స్ రాదు... ఇలా సంక్షేమ వసతిగృహాలకు ఆర్థికపరమైన చిక్కులు వీడటం లేదు. ప్రస్తుతం కాస్మెటిక్ చార్జీలకు సంబంధించి బీసీ సంక్షేమశాఖ పరిధిలో బడ్జెట్ వచ్చింది.. కానీ టోకెన్ నంబర్ల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్‌లో బడ్జెట్ రావడంతో పాటు... బిల్లులు జనరేట్ అయ్యాయి. కానీ క్లియరెన్స్ కోసం వేచి చూడాల్సి వస్తోంది.

బిల్లులు జనరేట్ అయ్యాయి...



జిల్లాలో ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించిన గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ బిల్లులు జనరేట్ అయ్యాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి బడ్జెట్ త్వరలోనే రానుంది. బడ్జెట్ రాగానే విద్యార్థుల ఖాతాలకు కాస్మెటిక్ చార్జీలు జమ అవుతాయి.

-రాధిక, డీడీ, ఎస్సీ సంక్షేమశాఖ

చూసిన కనులదే భాగ్యము..!

వైభవంగా ఖాద్రీశుడి ప్రజాగరుడ సేవ



గరుత్మంతుడిపై దర్శనమిస్తున్న శ్రీవారు

కదిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం లక్ష్మీ నరసింహ స్వామి వారు ప్రజాగరుడసేవ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారంలో సోమవారం రాత్రి బయల్దేరిన శ్రీవారు మంగళవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు. వెంటనే నిత్య పూజ, హోమం, గ్రామోత్సవం నిర్వహించారు. సంధ్యాసమయంలో గరుడవాహనంపై కొలువుతీరిన శ్రీవారిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. విద్యుత్‌దీపకాంతుల నడుమ శ్రీవారు తిరువీధుల్లో విహరించారు. బ్రహ్మరథోత్సవానికి రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిట లాడుతోంది. వారికి వినోదం పంచడం కోసం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు గజవాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారు గజవాహనంపై విహరిస్తారు. ఈవాహనం తరువాత రోజు బ్రహ్మరథోత్సవం జరగనున్నది. శ్రీవారి ఆలయం ఇప్పటికే భక్తులతో కిటకిటలాడుతున్నది. ఐరావతంపై శ్రీవారు భక్తులకు దర్శనమిస్తారు.



స్వామివారిని దర్శచుకుంటున్న భక్తులు

క్రైం కార్నర్

ఆటో బోల్తా.. 14 మంది కూలీలకు గాయాలు

● చికిత్స పొందుతూ ఒకరి మృతి ● నలుగురి పరిస్థితి విషమం


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

తాడిపత్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడి 14మంది కూలీలకు గాయాలయ్యాయి. వీరిలో ఒక రు మృతి చెందగా.. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనపై రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్, శ్రీనివాసపురానికి చెందిన కూలీలు నంద్యాలజిల్లా కొలిమిగుండ్ల మండలం పేరుసోముల గ్రామంలో మిర్చిపంటను కోసేందుకు మంగళవారం తెల్లవారుజామున ఆటోలో వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి అదే ఆటోలోనే తాడిపత్రికి బయలుదేరారు. కాగా సజ్జలదిన్నె గ్రామ సమీపంలోకి రాగానే ఆటో ముందు టైరు పంక్చర్ అయి ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో 14 మంది కూలీలు గాయపడ్డారు. వారిలో రసూల్‌బీ, లక్ష్మిదేవి, శారద, నారాయణమ్మ, బీబీల పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషమంగా ఉన్న ఐదుగురిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రసూల్‌బీ(57) మృతి చెందింది. మృతురాలికి భర్త మహమ్మద్, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి స్థానిక ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. ఆటో డ్రైవర్ అధిక సంఖ్యలో కూలీలను ఎక్కించడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. ఆ ఆటోడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని రూరల్ ఎస్ఐ ధరణీబాబుకు సూచించారు. ఆయన వెంట టీడీపీ ఎస్సీ రవీంద్రారెడ్డి, హరినాథ్ రెడ్డి, యుగంధర్, నీలకంఠ, నరసింహులు, భాస్కర్‌రెడ్డి, విజ్జి, మల్లికార్జున తదితరులు ఉన్నారు.


చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

కాశీకి వెళ్తే.. ఇంట్లో చోరీ

● రాచువారిపల్లిలో ఘటన


ఇంట్లో చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు

తనకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచువారిపల్లి గ్రామంలో ఉన్న దేశాయి భక్తవత్సలరెడ్డి నివాసంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు గుర్తించారు. దీనిపై ఆ కుటుంబానికి చెందిన సమీప బంధువు దేశాయి సంజీవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భక్తవత్సలరెడ్డి వారం రోజుల కిందట కుటుంబంతో కలిసి కాశీకి వెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన దొంగలు ఇంటి వెనుక వైపున ఉన్న తోటలో నుంచి తలుపుల గడియలు పగలకొట్టి, లోపలికి ప్రవేశించారని పోలీసులు తెలిపారు. ఇంటిలో ఉన్న మూడు బీరువాలు పగలకొట్టి వస్తువులను చెల్లా చెదురు చేశారు. అనంతరం ఇంటి బయట ఉన్న తోటలోకి వచ్చి కొబ్బరి కాయలు కోసుకుని తాగి వెళ్లినట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న సంజీవరెడ్డి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన పోలీస్ క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. ఈవిషయంపై ఎస్ఐని సంప్రదించగా ఇంటి యజమాని తీర్థయాత్రల్లో ఉన్నారని, ఆయన వచ్చిన తర్వాత ఏమి పోయిందో చెబితేకానీ తెలియదన్నారు.

సజావుగా ప్రమోషన్ల కౌన్సెలింగ్

అనంతపురం టౌన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించారు. వారికి ఎంపీహెచ్ఓ(ఫీమేల్)గా కేడర్ మార్చి, వైద్యశాఖలోకి విలీనం చేస్తూ ఉద్యోగోన్నతులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆరు నెలలుగా ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో సచివాలయాల ఏఎన్ఎంలు ఎదురుచూస్తూ వచ్చారు. ఎట్టకేలకు జిల్లా వైద్యశాఖ గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించింది. మంగళవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ దేవి, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి ప్రక్రియను పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా సీనియార్టీని తయారు చేశారు. 217 ఖాళీలను చూపారు. తొలుత స్పౌజ్, పీహెచ్ కేటగిరీల వారికి పోస్టింగ్ ఇచ్చారు. తర్వాత జనరల్ కేటగిరీ వారికి కేటాయించారు. మొత్తం 205 మంది సచివాలయగ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్ఓ(ఎఫ్)గా ఉద్యోగోన్నతులు కల్పించి ఉత్తర్వులు అందజేసారు.

సాంకేతిక నైపుణ్యమే కీలకం: ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి18(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక నైపుణ్యమే కీలకమని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులకు సైబర్, ఇతర నేరాలలో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్‌పై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహిం చారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సైబర్ నిపుణులు రామాంజ నేయులుతో సైబర్ నేరాల పరిశోధనలో పాటించాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అధిక సంఖ్యలో జరుగుతున్న సైబర్ మోసాలు అరికట్టేందుకు, కేసులు సులభతరంగా ఛేదించేందుకు సాంకేతిక నైపుణ్యంతో పాటు శోధన ఎంతో ముఖ్యమన్నారు. నేరాల తీరు మారుతోందని, ప్రతీ నేరం, సైబర్ క్రైం సాంకేతికతో ముడిపడి ఉందన్నారు. ఈ నేరాలను ఛేదించేందుకు ప్రత్యేకమైన శిక్షణ, వృత్తి నైపుణ్యం అవసరమన్నారు. దీనిని మెరుగుపరుచుకుంటే సైబర్ నేరాలు ఛేదించవచ్చన్నారు. సమావేశంలో పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సీఎంతో మహిళా ప్రజాప్రతినిధులు



అరకు కాఫీతో ఆరోగ్యం


అసెంబ్లీ ఆవరణలో జిల్లాకు చెందిన మహిళా ఎమ్మెల్యేలు అరకు కాఫీ టేస్ట్ చూశారు. అరకు కాఫీ తాగితే అరోగ్యంగా ఉండవచ్చని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు.

స్నేహమంటే ఇదేరా...



ఆటలు.. ఫొటోలు

సరదాగా గడిపిన ఎమ్మెల్యేలు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

బడ్జెట్ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అసెంబ్లీ ఆవరణలో మంగళవారం ఫొటో షూట్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, శాసన మండలి చైర్మన్, శాసనసభ స్పీకర్, మంత్రులతో ఫొటోలు దిగారు. ఉమ్మడి జిల్లా నుంచి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, జేసీ అశ్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరా రెడ్డి ఫొటో షూట్‌లో పాల్గొన్నారు.

క్రీడాపోటీలు

విజయవాడ ఇందిరా గాంధీ క్రీడా మైదానంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేకంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్ పోటీలలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. స్పీకర్ లెవెన్ వర్సెస్ సీఎం లెవెన్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో స్పీకర్ లెవెన్ జట్టు తరఫున అమిలినేని పాల్గొన్నారు. షటిల్ పోటీలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ జట్టు విజేతగా నిలిచింది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు ఒక జట్టుగా, మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఒక జట్టుగా తలపడ్డారు.



ఫొటో.. ఓ మైలు రాయి: సింధూర



శాసనసభ ఫొటో సెషన్ తన జీవితంలో ఓ మైలురాయి అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. అతిపిన్న వయస్సులో, తన మామ పల్లె రఘునాథరెడ్డి ఆశీస్సులతో ప్రజలు తనకు పెద్ద బాధ్యతను అప్పగించారని అన్నారు. పుట్టపర్తి తొలి మహిళా ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని అన్నారు. వైసీపీ సభ్యుల తీరు మినహా శాసన సభ సమావేశాలు ప్రశాంతంగా సాగుతున్నాయని అన్నారు. నియోజకవర్గ సమస్యలను శాసనసభలో ప్రస్తావించే అవకాశం తనకు దక్కినందుకు సంతోషంగా ఉందని అన్నారు.

కొడితే సిక్సే..



వాల్మీకి.. బోయలను ఎస్టీల్లో చేర్చండి

సీఎం చంద్రబాబుకు వాల్మీకి ప్రజాప్రతినిధుల వినతి


ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న కాలవ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

అనంతపురం/రాయదుర్గం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకి, బోయలను షెడ్యూల్ తెగల్లో చేర్చాలని సీఎం చంద్రబాబుకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, వాల్మీకి సామాజికవర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలోని ఆయన చాంబర్‌కు కాలవ, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, పార్థసారథి వెళ్లి వినతి పత్రం అందజేశారు. వాల్మీకి, బోయలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డారని అన్నారు. ఆరు దశాబ్దాలకుపైగా తమ న్యాయమైన సమస్యకు పరిష్కారం లభించలేదని అన్నారు. బోయ, వాల్మీకి ప్రజల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ అంశంపై శాసనసభ, శాసనమండలిలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. ప్రొఫెసర్ సత్యపాల్ కమిటీ సిఫార్సు మేరకు 2017లో కేంద్రానికి సానుకూల నివేదిక పంపామని అన్నారు. ఈ నివేదికలోని ఆరు అంశాలపై వివరణ కోరుతూ కేంద్ర జనగణన విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రాష్ట్రానికి లేఖ పంపారని అన్నారు. జగన్ ప్రభుత్వం ఈ అంశాన్ని వివాదంలోకి లాగిందని అన్నారు. రాయలసీమలోని బోయ, వాల్మీకులనే ఎస్టీ జాబితాలో చేర్చాలని జగన్ ప్రభుత్వం నివేదించి, ప్రాంతాల మధ్య గొడవలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూసిందని అన్నారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో వాల్మీకి, బోయలను ఎస్టీలుగా గుర్తించారని అన్నారు. బంధుత్వాలు, ఆచారాలతో పాటు సామాజికంగా, ఆర్థికంగా ఒకే విధమైన ప్రమాణాలతో జీవిస్తున్న వారిని ఆ రాష్ట్రం ఎస్టీలుగా గుర్తించగా... మన రాష్ట్రంలో మాత్రం సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. కేంద్రం కోరిన ఆరు అంశాలపై త్వరగా సమగ్ర, సానుకూల నివేదిక పంపాలని కోరారు. ఎన్డీయే ప్రభుత్వంలో ఉన్న పలుకుబడితో సమస్య త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని ముఖ్యమంత్రిని కోరారు.

9వేల మెట్రిక్ టన్నుల కందుల కొనుగోలు

● ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి

అనంతపురం అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటిదాకా 9వేల మెట్రిక్ టన్నుల కంది ఉత్పత్తులు కొనుగోలు చేసినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబరు రెండోవారం నుంచి రైతు సేవాకేంద్రాల్లో 11 వేల మంది రైతులు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాలోని 31 కేంద్రాల ద్వారా ఇప్పటిదాకా 7,053 మందితో రూ.60కోట్ల విలువైన 9వేల టన్నుల కంది పంటను కొనుగోలు చేశారు. ఇందులో ఇప్పటిదాకా 5,087 మందికి రూ.40 కోట్ల సొమ్ము జమైందన్నారు. రైతుల నుంచి కంది కొనుగోలు చేసిన వారం నుంచి 10 రోజుల్లోపు డబ్బు జమవుతోందన్నారు.

పప్పుశనగ విక్రయానికి నమోదు చేసుకోండి

పప్పుశనగ ఉత్పత్తులను విక్రయించాలనుకునే రైతులు రైతు సేవాకేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి పేర్కొన్నారు. పప్పుశనగ ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. క్వింటా పప్పుశనగ ధరను రూ.5650గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈక్రాపింగ్ చేయించుకున్న రైతులతో మాత్రమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తామన్నారు. 14 శాతంలోపు తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని పప్పుశనగ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతుల ఆటల పండుగ


వీల్‌చైర్ పోటీల్లో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు

చెన్నేకొత్తపల్లి, మార్చి18(ఆంధ్రజ్యోతి): ప్రతిభా దివ్యాంగుల సొసైటీ ఆధ్వర్యంలో చెన్నే కొత్తపల్లిలో మంగళవారం విభిన్న ప్రతిభా వం తుల ఆటలపండుగ ఉత్సాహంగా సాగింది. టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చింతవనం కార్యాలయ ఆవరణలో నిర్వహించా రు. రామగిరి, రొద్దం, చెన్నేకొత్తపల్లి, పెనుకొండ మండలాలకు చెందిన దివ్యాంగ సభ్యులు వివిధ ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి టింబక్టు కలెక్టివ్ వ్యవస్థాపకురాలు మేరి వటముట్టం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టింబక్టు అసిస్టెంట్ డైరెక్టర్ సుకన్య, సంస్థ మేనేజర్లు రమేశ్‌కుమార్, శ్రీకాంత్, మహాశక్తి సీఈఓ రమీజ, మిళిత మేనేజర్ జయశ్రీ, కో ఆర్డినేటర్ గణేశ్,నాగరాజు, పెద్దక్క, ప్రతిభా డైరెక్టర్లు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.25వేలు

అనంతపురం రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 25,650 పలికనట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6,660, సరాసరి రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

నీ వల్లే నీ భార్య చనిపోయింది

● క్రిమినల్ కేసు పెట్టిస్తా: డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): 'ఏమయ్యా..! మీ భార్యకు గర్భంలో సమస్య ఉందని, అలాగే ఉంచితే ప్రసవ సమయంలో ఆమె ప్రాణానికే ముప్పు వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు, వైద్యసిబ్బంది, ఐసీడీఎస్, రెవెన్యూ అధికారులు, పోలీసులు చెప్పినా వినరా? ఇపుడు ఏమైంది... మీ భార్య చనిపోయింది. నీపై క్రిమినల్ కేసు పెట్టిస్తున్నా. దీన్ని చూసి మరొకరు ఇలా చేయరు' అంటూ మరణించిన ఓ గర్భిణి భర్తపై డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఫిబ్రవరి నెలలో జరిగిన మాతా శిశుమరణాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తన భార్య మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని గత నెలలో గొడవ చేసిన బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన హనుమంతప్పను పిలిపించారు. డాక్టర్లు, సిబ్బంది ఆధారాలతో ఇచ్చిన నివేదికను చూసిన డీఎంహెచ్ఓ మండిపడ్డారు. అధికారులు చెప్పేది మీ మంచికేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లికి ప్రమాదమని తెలిసినా మూడో బిడ్డ అవసరమా అని గట్టిగా ప్రశ్నించారు. అనారోగ్య సమస్యలతో నీ భార్య తిప్పమ్మ ఫిబ్రవరి 20న చనిపోతే నెపాన్ని డాక్టర్ల మీద రుద్దావ్ ఇది కరెక్టేనా అని నిలదీశారు. పుట్టిన బిడ్డకు కాళ్లు వంకర్లున్నాయని ఐసీడీఎస్ వాళ్లకు ఇచ్చేశావ్..! ముందున్న ఇద్దరు పిల్లలను ఏమి చేస్తావో తెలీదు. నీ వల్లే నీ భార్య చనిపోయిందన్నారు. హనుమంతప్పపై బ్రహ్మసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సంబంధిత డాక్టరు, సిబ్బందిని డీఎంహెచ్ఓ ఆదేశించారు.

● గ్రామాలలో ఉన్న వారికి అవగాహన తక్కువగా ఉంటుంది. అలాంటపుడు అనారోగ్య సమస్యలు ఉన్నపుడు వారికి తెలుగులోనే అర్థమయ్యేలా విపులంగా తెలపాలని డాక్టర్లకు డీఎంహెచ్ఓ ఆదేశించారు. హైరిస్క్ గర్భిణి విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రసవం తర్వాత కూడా తల్లీబిడ్డల ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్లు, సిబ్బందికి డీఎంహెచ్ఓ సూచించారు. సమీక్షలో డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్, డీఐఓ డాక్టరు యుగంధర్, డాక్టర్లు శంకర నారాయణ, పార్వతి, ఎంపీహెచ్ఓ లక్ష్మన్న, డెమోలు త్యాగరాజు, గంగాధర్ వివిధ పీహెచ్‌సీల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి

ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకూడదు

● ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టండి
● సిబ్బందికి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్ ఆదేశాలు


మాట్లాడుతున్న ఎస్ఈ సురేశ్

అనంతపురం న్యూటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని, జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్.. ఏఈ, డీఈలకు సూచించారు. స్థానిక కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లాలోని ఏఈలు, డీఈలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ.. నీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. బోర్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. చేతిపంపులన్నింటినీ వినియోగంలోకి తీసుకరావాలని ఆదేశించారు. ట్యాంకర్లతో సరఫరా చేయాల్సిన అవసరం రాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఈఈ మురళీధర్‌రావు, డీఈలు శ్రీధర్, శ్రీనివాసులు, రెహనా వసీం, రామారావు పాల్గొన్నారు.

లైనింగ్ వద్దు..


నిరసన తెలుపుతున్న జలసాధన సమితి నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులు రద్దు చేయాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని పప్పూరు రామాచార్యుల విగ్రహం ఎదుట జలసాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలతో నిరసన చేపట్టారు. ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాకు నీరందించే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల కోసం జారీ చేసిన 404, 405 జీఓలను వెంటనే రద్దు చేయాలన్నారు. కాలువ వెడల్పు చేయాలని కోరారు. ఈ విషయంలో పార్టీలకతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, కార్యదర్శి ఉపేంద్రకుమార్, రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ లోక్ డివిజన్ ఈఈగా రమణారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ లోక్ డివిజన్ ఈఈగా వెంకటరమణారెడ్డిని నియమించారు. పలువురు డీఈలకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆయా స్థానాలను కేటాయించి ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్చెల్సీ లోక లైజేషన్ ఈఈగా వెంకటరమణారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈగా రమేష్‌బాబు, మైనర్ ఇరిగేషన్ అనంతపురం ఈఈగా రాము, ధర్మవరం ఈఈగా సురేంద్రనాథ్ రెడ్డి, పెనుకొండ ఈఈగా గురుమూర్తి, డిప్యూటీ ఎస్ఈగా పార్థసారథి, తుంగభద్ర డ్యాం హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా శశిరేఖ, హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా పెంచలయ్యను నియమించారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి డివిజన్-7 ఈఈగా శ్రీనివాసులు, డిప్యూటీ సీఈగా వెంకటేశ్వర్లు, పెనుకొండ ఈఈగా మురళి, డివిజన్-2 ఈఈగా ఉమామహేశ్వరరావును నియమించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం)	సహర్ (గురువారం ఉదయం)
కదిరి:	6.31	5.06
ధర్మవరం:	6.36	5.06

చిగురించిన సొంతింటి ఆశ

- ప్రభుత్వ ప్రకటనపై హర్షం
- స్థలముంటే గృహాల మంజూరు
- పాత బిల్లులకూ మోక్షం
- ఉపాధి లభిస్తుందని కార్మికుల ఆశ


ఎన్పీకుంట జగన్న లేఅవుట్‌లో పెరిగిన కంపచెట్లు

నంబులపూలకుంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'ప్రతి కుటుంబానికీ సొంతిల్లు ఉండేలా చేస్తాం. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తాం. స్థలం ఉన్న వారికి ఇంటిని మంజూరు చేస్తాం..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో మరో సారి స్పష్టం చేశారు. దీంతో తమ సొంతింటి కల నెరవేరబోతోందని పేదల్లో ఆశలు మళ్లీ చిగురించాయి. గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను పూర్తిగా గాలికి వదిలేసింది. కేవలం కాలనీలను ఏర్పాటు చేసిందే తప్పా.. సక్రమంగా స్థలాలనూ కేటాయించలేదు. అక్కడ సౌకర్యాలూ కల్పించలేదు. స్థలాలు వచ్చిన వారు ఇంటి నిర్మాణం ప్రారంభించగా.. బిల్లులు రాకపోవడం నిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. దీంతో ఎవరూ ఇంటి నిర్మాణం ఆసక్తి చూపలేదు. దీంతో జగనన్న కాలనీల్లో పిచ్చిమొక్కలు.. ముళ్లకంపలు విపరీతంగా పెరిగాయి. భవన నిర్మాణ రంగమూ పూర్తిగా దెబ్బతినడంతో.. భవన నిర్మాణ కార్మికులు, ఇటుకల తయారీదారులు, ఉడ్ వర్క్.... ఎలక్ట్రీషియన్లు.. తదితర కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. మరికొంత మంది సొంతూరులోనే చిన్న చిన్న పనులు చేసుకుంటూ.. కాలం వెళ్లదీస్తున్నారు. అసెంబ్లీలో ఇటీవల చంద్రబాబు ప్రకటనతో తమకు మళ్లీ ఉపాధి లభిస్తుందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● విరివిగా దరఖాస్తులు..

అర్హులందరికీ ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేస్తామని, స్థలం ఉన్న వారికి ఇల్లు మంజూరు చేస్తామని టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మండల వ్యాప్తంగా 7.04 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి స్థలం తీసుకొని.. ఇల్లు నిర్మించుకోని 150 కుటుంబాల వారూ దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి పొజిషన్ సర్టిఫికెటుకు దరఖాస్తు చేసుకోవాలని గృహనిర్మాణ శాఖాధికారులు సూచించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబం కులధ్రువీకరణ పత్రంతో పాటు దరఖాస్తు చేసుకోవాలని గృహనిర్మాణ శాఖ ఆదేశించింది. దీంతో అర్హులు మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓ, సర్వేయర్ పరిశీలించి, నివాస స్థల ధ్రువీకరణ పత్రం మంజూరుకు ఆదేశించించాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ సిబ్బందికి సూచించారు.

● పాత బిల్లులూ మంజూరు

2016 ఎన్టీఆర్ గృహాలు నిర్మించుకుని, అర్థాంతరంగా బిల్లులు అందక నిలిపివేసిన గృహాలకు, అలాగే ఇళ్ల పూర్తి చేసుకుని బిల్లులు అందని గృహాలకు బిల్లులు పంపిణీ చేయాలని టీడీపీ ప్రభుత్వం ఆదేశించింది. బీసీ, ఎస్సీ కులాలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీకి అదనంగా రూ.75 వేలు ఇచ్చేలా నిర్ణయించింది. అర్థాంతరంగా నిర్మాణాలు ఆగిపోయిన లబ్ధిదారులు ఆ బిల్లులతో సొంతింటికళ నేరవేరుతుందని ఆనందంతో ఉన్నారు. ప్రస్తుతం గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు రూ.2.80 లక్షల ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఉచిత ఇసుక కూడా అందుబాటులో ఉండటంతో అనేక మంది అర్హులు ఇల్లు నిర్మించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

● కార్మికుల ఆనందం :

గత వైసీపీ ప్రభుత్వం గృహనిర్మాణాలు చేపట్టకపోవడంతో ఐదేళ్లుగా ఆ రంగం దెబ్బతింది. ఇటుక వ్యాపారులు, మేస్త్రీలు చాలా ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం గృహాల మంజూరుకు అంగీకరించడంతో ఇటుక యజమానులు, మేస్త్రీలు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో ఏడువందలకుపైగా లబ్ధిదారుల జాబితా రావడంతో ఇటుక వ్యాపారాలు బాగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మేస్త్రీలు కూడా ఇక తమకు చేతి నిండా పనులు లభిస్తాయని అంటున్నారు. ఉచిత ఇసుకను ప్రభుత్వం అందిస్తుండడంతో ఇసుక రిచ్‌లు ఏర్పాటు చేస్తే లబ్ధిదారులకు మరింత అనుకూలంగా ఉంటుందని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు.

దరఖాస్తు చేసుకోండి

704 మంది గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులైన జాబితా ఆధారంగా వారు పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకోవాలని సూచించాం. గత టీడీపీ పాలన నుంచి నేటి వరకు నిలిచిపోయిన గృహ నిర్మాణాల బిల్లులు మంజూరు చేస్తాం.

-శ్రావణి, హౌసింగ్ ఏఈ

ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా



సొంతింటి కోసం ఎన్ని కష్టాలు పడి స్థలాన్ని కొన్నాం. రెండున్నర సెంట్లలో ఇళ్ల నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వ అనుమతి రాగానే వెంటనే పనులు ప్రారంభిస్తాం. సొంతింటి కల నెరవేరబోతుంటే ఆనందంగా ఉంది.

- శశికళ, నంబులపూలకుంట

పునాది వేసుకున్నాం



పెద్దలు ఇచ్చిన స్థలంలో పునాదులు వేసుకున్నాం, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పక్కా ఇంటిని నిర్మించుకుంటాం. అనేక సంవత్సరాలుగా ఎదురు చూ స్తున్న సొంతింటి కల నేరవేరుతుందని ఆనందంగా ఉంది. ప్రస్తుతం అద్దె ఇళ్లలో అద్దెలు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నాం.

-ప్రసన్న, నంబులపూలకుంట

కదిరి కళకళ


విద్యుద్దీపాల అలంకరణలో శ్రీవారి ఆలయం

కదిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యం లో లక్ష్మీనరసింహస్వామి భక్తులతో కదిరి కళకళలాడుతోంది. సంధ్యాసమయంలో నిర్వహించే పలు సేవల్లో వేలాది మంది భక్తులు పాల్గొంటున్నారు. రాత్రి వేళల్లో ఆలయ ప్రాంగణంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొంటున్నాయి.


ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు



స్వర్ణాంధ్ర పదిసూత్రాలు అమలు చేయాలి: కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రా 2047 సహకారానికి పది సూత్రాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదే శించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖలాధికారులతో ఈ విషయమై సమీక్ష నిర్వహించారు. స్వర్ణాంధ్ర పదిసూత్రాలైన పేదరికంలేని సమాజం, ఉద్యోగ, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, నీటి భద్రత, ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పన, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛంద్రా.. తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. త్వరలో విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో జరిగే కలెక్టర్ల సదస్సుకు జిల్లాలోని వివిధ శాఖల నివేదికలు సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, సేవలు రంగాల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. అలాగే నియోజకవర్గస్థాయిలో విజన్ డాక్యుమెంటరీ రూపొందించాలన్నారు. జిల్లా సిల్క్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగయువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నల్లచెరువు మండలంలో స్వయం సహకార సంఘాల ఆధ్వర్యంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న ఉద్యానవన ప్రాసింగ్ యూనిట్‌పై సమీక్షించారు. కొత్తచెరువు, చిల్లమత్తూరు, పెనుకొండ, ముదిగుబ్బల్లో అన్నక్యాంటీన్ల ఏర్పాట్లుపై చర్చించారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వండి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుపేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజనేయులు కలెక్టర్ టీఎస్ చేతన్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో ఆయనకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని 14 పంచాయతీల్లో అర్హులైన పేదలు చాలా మంది ఉన్నారని, వారికి ఎం.కొత్తపల్లి సర్వేనెంబర్ 216లో 2.71 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇంటిపట్టాల ఇవ్వాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత తహసీల్దార్‌ను క్షేత్రస్థాయిలో పంపి, విచారణ చేసి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అమడగూరు మండల అధ్యక్షుడు వేమనారాయణ, నాయకులు సున్నంపల్లి రంగారెడ్డి, అశ్వర్థప్ప, మేకల వెంకటరమణ, ఆంజనేయులు ఉన్నారు.

● సార్.. న్యాయం చేయండి

అమడగూరు మండలంలోని జౌలకొత్తపల్లికి చెందిన రామచంద్రకు 1995లో ఇళ్ల మంజూరైంది. అప్పుడే వారు ఇళ్ల కట్టుకోలేదు. రామచంద్ర మరణించాడు. ప్రస్తుతం అతని భార్య మంగమ్మ ఇంటి నిర్మాణం చేపట్టింది. ఇంటిని పైకప్పు వరకు నిర్మించారు. బిల్లుల కోసం ఆమె హౌసింగ్ అధికారులను సంప్రదించగా.. రామచంద్ర జీవించి ఉండగానే ఇంటిని నిర్మించుకున్నట్లు.. బిల్లులూ మంజూరు చేసినట్లు చెప్పారు. తాను ఇంటి నిర్మాణానికి ఇటీవల చేపట్టానని, ఎలాంటి బిల్లులు తమకు మంజూరు కాలేదని ఆ అధికారులకు చెప్పినా.. ఫలితం లేకుండాపోయింది. దీంతో ఆమె మంగళవారం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేసింది. తమకు బిల్లు చేయకుండా తిప్పుకుంటున్నారని వాపోయింది. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది

కొత్తచెరువులో తాగునీటికి కటకట

- బోర్లు కాలిపోయి 20 రోజులైనా పట్టించుకోని పాలకులు, అధికారులు
- పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళల ధర్నా


పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

కొత్తచెరువు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తచెరువులో పంచాయతీ బోర్లు కాలిపోయి పలు కాలనీలకు సుమారు 20 రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదు. స్థానిక బసవన్నకట్ట వీధి, ముస్లిం కాలనీ, బోయవీధి, గాంధీ నగర్, బీసీ కాలనీల్లో ఈ సమస్య మరి తీవ్రంగా ఉంది. దీంతో ఆ కాలనీలకు చెందిన మహిళలు మంగళవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పంచాయతీ బోర్లు కాలిపోయి 20 రోజులు అవుతున్నా... వాటికి మరమ్మతులు చేయించకుండా.. అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దీనిపై పంచాయతీ సర్పంచ్, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దీంతో పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నామని అన్నారు. కాగా, పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉండటంతో... కనీసం వారికి సమాధానం చెప్పే వారే లేకపోవడంతో వారు వెనుతిరిగి వెళ్లారు. దీనిపై కొత్తచెరువు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీ గోపాల్‌రెడ్డిని వివరణ కోరగా.. తాగునీటి బోర్ మోటార్‌కు రివైండింగ్ చేయించి.. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

తాగునీరు వృథా


వృథాగా పోతున్న తాగునీరు

కదిరిఅర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల బెస్తవీధిలోని బొడ్రాయి వద్ద పైపులైన్ లీకేజీ అవుతుండటంతో తాగునీరు రెండు నెలలుగా వృథాగా పోతోంది. ఇన్నిరోజులైనా సంబంధితాధికారులు పట్టించుకోలేదు. అంతేకాకుండా తాగునీరు రోడ్డుపై పారుతుండడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీరు నిల్వ ఉండటంలో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. పార్నపల్లి నుంచి రూ.లక్షలు ఖర్చు చేసి కదిరికి తెప్పిస్తున్న తాగునీరు ఇలా వృథా అవుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరి

తనకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ తప్పకుండా యూనిక్ ఐడీ కోసం పేరు నమోదు చేసుకోవాలని ఏఓ శ్రీహరినాయన్ మంగళవారం పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేస్తున్న పథకాల్లో అక్రమాలు లేకుండా ఉండటం కోసం.. నిజమైన అర్హులకు లబ్ధి చేకూర్చడం కోసం.. రైతులు తప్పనిసరిగా పేరును నమోదు చేసుకోవాలన్నారు. రైతు విశిష్ట గుర్తింపు ప్రక్రియ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లోని రైతుసేవా కేంద్రాల్లో అగ్రికల్చర్, హర్టికల్చర్, సిరికల్చర్ అసిస్టెంట్లు ఫార్మర్ రిజిస్టర్ పోర్టల్‌లో రైతు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ ఫోన్ తీసుకెళ్లాలన్నారు.

న్యూస్ బాక్స్

ధర్మవరం అభివృద్ధికి రూ.3 కోట్లు

ధర్మవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ధర్మవరం మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు మున్సిపల్ అధికారులు మంగళవారం తెలిపారు. ఈ నిధులను అత్యవసర, ప్రధాన అభివృద్ధి పనులకు వినియోగిస్తామన్నారు. నీటి సరఫరా వ్యవస్థ మెరుగుదల, రహదారుల మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, వీధిదీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి తదితర మౌలిక సదుపాయాలను మెరుగు పరచడానికి ఈ నిధులు వినియోగిస్తామన్నారు. పట్టణ అభివృద్ధికి మరిన్ని ప్రాజెక్టులను త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.

డయాలసిస్ సెంటర్‌లో పడకల పెంపు

ధర్మవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో పడకల సంఖ్యను ఐదు నుంచి పదికి పెంచినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయ్ శతజయంతి సందర్భంగా గత ఏడాది డిసెంబరు 25న ఈ డయాలసిస్ సెంటర్‌ను ఐదు యంత్రాలతో ప్రారంభించామన్నారు. డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ కేంద్రంలో అదనంగా మరో ఐదు మిషన్లను ఏర్పాటు చేసినట్టుగా తెలిపారు. రాబోవు రోజుల్లో మరిన్ని ఆస్పత్రుల్లో ఇదే తరహా సౌకర్యాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు.

చిన్నారులకు వైద్యశిబిరం

నంబులపూలకుంట, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చిన్నారులకు ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన డాక్టర్ మహేష్‌నాయక్, ఆయూష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 60 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి.. ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ వలీ బాషా, సర్పంచ్ ఆంజనమ్మ, చిన్నారులు, తల్లులు, ఆయూష్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఓబుళదేవరచెరువు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని.. ఉపవాసం ఉన్న ముస్లింలకు మండల కేంద్రం మంగళవారం 108 డివిజన్ ఇన్‌చార్జి అబ్లుహుస్సేన్ ఇఫ్తారు విందు ఇచ్చారు. ఉపవాసమున్న వారితో పాటు జమాత్‌కు కూడా ఇఫ్తారు విందు ఇచ్చారు.

బాలసముద్రంలో పోలీసుల పల్లె నిద్ర


గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

తనకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలసముద్రంలో కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐ గోపీ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించి.. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్నచిన్న విషయాలకు ఆవేశాలకు లోనుకాకుండా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సమస్యలుంటే తమను ఆశ్రయించాలన్నారు.

క్రైం న్యూస్..

ఐదుగురిపై కేసు నమోదు

ధర్మవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయినగర్ వాసి గణేశ్‌పై దాడిచేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... సత్యసాయినగర్‌కు చెందిన ఆనంద్.. చరణ్ వద్ద రూ.30 వేలు అప్పు తీసుకున్నాడు. ఆ అప్పు చెల్లించాలని చరణ్, అతని స్నేహితులు హరి, ఇల్లు, ప్రేమ్, శశిధర్ ఆనంద్‌తో మంగళవారం గొడవపడ్డారు. ఆనంద్‌ను రక్షించడంలో భాగంగా అడ్డుగా వచ్చిన గణేశ్‌పై ఆ ఐదుగురు దాడిచేశారు. దీంతో గాయపడిన గణేశ్ వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై 324 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఇరువర్గాలపై...

గాండ్లపెంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీ బొల్లుగుట్లపల్లి గ్రామంలో రమణ, పాపాన్న వర్గాలు స్థల వివాదంపై మంగళవారం ఘర్షణ పడ్డాయి. దీనిపై ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు జమేదార్ శ్రీనివాసులు చెప్పారు.

కట్టెతో దాడి..

ధర్మవరంరూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పేపల్లి గ్రామంలో తల్లి, కుమారుడు లక్ష్మీదేవి, మహేష్‌పై అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ కట్టెతో మంగళవారం దాడిచేయడంతో అతనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీదేవి ఇంటికి సంబంధించి కరెంట్ వైర్‌ను గుర్తుతెలియని వారు కట్ చేశారు. ఆ వైర్‌ను మహేష్ సరిచేసుకుంటూ ఎవరు కట్ చేశారో అంటూ తిట్టసాగాడు. అదే సమయానికి వారి బంధువైనా ప్రవీణ్ అటుగా వెళ్తూ ఎవరిని తిడుతున్నావంటూ మహేష్‌తో గొడవకు దిగాడు. లక్ష్మీదేవి కూడా అక్కడికి రాగా.. గొడవ పెద్దదైంది. ఆగ్రహించిన ప్రవీణ్ అక్కడే ఉన్న కట్టె తీసుకుని లక్ష్మీదేవి, మహేష్‌పై దాడిచేశాడు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పోలీసులకు వైద్య పరీక్షలు


పోలీసులకు ఈసీజీ పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధర్మవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులకు స్థానిక షిర్డీసాయిబాబా కల్యాణ మండపంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో దాదాపు 200 మంది పోలీసులకు సవేరా ఆస్పత్రి వైద్యులు ఈసీజీ, 2డీఎకో, బీపీ తదితర పరీక్షలు చేశారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ.. పోలీసులు ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపరాదన్నారు. అదేవిధంగా పాత్రికేయ కుటుంబ సభ్యులకు కూడా వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్ఐలు పాల్గొన్నారు.

బాలికలు, మహిళా చట్టాలపై అవగాహన

ధర్మవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళా చట్టాలపై రెవెన్యూ డివిజన్ స్థాయి మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు భవనంలో మంగళవారం నిర్వహించారు. ఇందులో సీడీపీఓ కవిత మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ బాలికలు, మహిళా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. లైంగిక వేధింపులకు గురికాకుండా బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బాల్యవివాహాలను అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ మహేశ్, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండప్ప, ప్రొటెక్షన్ ఆఫీసర్స్ నాగలక్ష్మీ, మురళీధర్, సోషల్ వర్కర్ ఆనంద్, వనజాక్షి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ కవిత

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో వ్యాసరాయ ఆరాధనోత్సవం


హోమం నిర్వహిస్తున్న పండితులు

పెనుకొండ, మార్చి18, (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని లక్ష్మీకాంత బృందావనంలో వ్యాసరాయ సార్వభౌముల 486వ ఆరాధనోత్సవాల భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయ కమిటీ నిర్వాహకుడు పాలూరి క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామీజీలు పవమానహోమం, పంచామృత అభిషేకాలు తీర్థప్రసాద వినియోగం గావించారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, మార్చి18, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భోగసముద్రం చెరువు వద్ద వెలసిన దక్షిణముఖ ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఉద్యోగాలకు 16 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

మడకశిరటౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జె.మద్దిలేటి తెలిపారు. మంగళవారం ఉద్యోగ విజయోత్సవం, వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ.. సాంకేతిక విద్యలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. వివిధ కంపెనీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

గురుకులంలో ప్రవేశానికి గడువు పొడిగింపు

మడకశిర రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం, ఐదో తరగతి, బ్యాక్‌లాగ్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జూనియన్ ఇంటర్ ప్రవేశ పరీక్ష మే4న ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలి


ఉపాధి పనుల వద్ద నిరసన తెలుపుతున్న కూలీలు

పెనుకొండ రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రొద్దం మండలంలోని శేషాపురం గ్రామంలో ఉపాధి కూలీలతో నాయకులు సమావేశం అయ్యారు. వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కూలీలు మాట్లాడుతూ ఉగాది, శ్రీరామనవమి పండుగలు రాబోతున్నాయని, పనిచేసిన వాటికి బిల్లులు రాక ఆందోళన చెందుతున్నారన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనను చేస్తామని వారు హెచ్చరించారు.

ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరుకావాలి

మడకశిర రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరుకాకపోతే చర్యలు తప్పవని ఎంఈఓ భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమై అయ్యవారు రాక... తలుపులు తెరుచుకోక.. అనే శీర్షికన కథనం ప్రచురతమైంది. దీనిపై జిల్లా అధికారులు స్పందించారు. ఎంఈఓ వెంటనే ఎగువ రామగిరి పాఠశాలకు వెళ్లి ఇద్దరు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విధులకు డుమ్మాకొట్టిన ఉపాధ్యాయుడికి ఎంఈఓ మెమో జారీ చేశారు.

గర్భిణులకు అన్నదానం

సోమందేపల్లి, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జామియా మసీదు ముతవల్లి మహమ్మద్, కమిటీ కార్యదర్శి అక్రం ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల నుంచి వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా మంగళవారం అన్నదానం చేపడతామన్నారు. వైద్యులు ఓంకార్, సీహెచ్ఓ రవీంద్ర, అన్వర్ బాషా, వాజీద్, బాషా, చాంద్ బాషా పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెనుకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 వలంటీర్లు పీఓ ప్రతాప్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలోని కంపచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. మొక్కలకు పాదులు చేసి నీరుపోశారు. ప్రిన్సిపాల్ కేశవరావు పాల్గొని మాట్లాడారు. కళాశాల లైబ్రేరియన్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో అల్లాబకాష్ ప్రతిభ

హిందూపురం అర్బన్ మార్చి 18(ఆంధ్రజ్యోతి): మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డ్ పోటీల్లో హిందూపురానికి చెందిన షేక్ అల్లాబకాష్ ప్రతిభ కనబరిచాడు. ఆదివారం సూళ్లురుపేటలో నిర్వహించిన మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డ్ పోటీల్లో 300 మంది పాల్గొన్నారు. హిందూపురం వైల్డ్ ఫిట్‌నెస్ జిమ్‌కు చెందిన అల్లాబకాష్ రాష్ట్ర వ్యాప్త పోటీల్లో 4వ స్థానంలో నిలిచాడు.

రేపు జాబ్‌మేళా

మడకశిరటౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

చెత్తను తొలగించరా..?

● డివైడర్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం
● పట్టించుకోని పంచాయతీ అధికారులు


డివైడర్ల మధ్యలో పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లు

సోమందేపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఎటుచూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పట్టణ నడిబొడ్డున డివైడర్లపై చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగి ఎటుచూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. డివైడర్లపై మహనీయుల విగ్రహాలను అడుగడుగునా ప్రతిష్ఠించారు. వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మరిచారు. ఆయా సందర్భాల్లో మాత్రమే శుభ్రం చేసి పూలమాలలువేసి నివాళులు అర్పిస్తారు. ఫొటోలకు ఫోజులిచ్చి కార్యక్రమం అయిపోయిందని ఎవరిదారిన వారు వెళ్లిపోతున్నారు. ఆ తరువాత ఎవరూ అటువైపు చూడరు. పంచాయతీ అధికారులు ప్రతినెలా స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం పేరుతో పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. మండలస్థాయి


పేరుకుపోయిన చెత్తాచెదారం

అధికారులు, ప్రజాప్రతినిధులు పరకలు పట్టి ఫొటోలకు ఫోజులిస్తారు. అభివృద్ధికి పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉన్నట్లు ప్రసంగాలు దంచేస్తారు. అదంతా ప్రచార ఆర్భాటమేనని స్థానికులు విమర్శిస్తున్నారు. విగ్రహాలవద్ద డివైడర్ల మధ్యలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటున్నా నాయకులకు ఇదేమి కనబడటం లేదు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో డివైడర్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పట్టణ నడిబొడ్డున ఈ పరిస్థితి ఉంటే ఇక మండల వ్యాప్తంగా ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. వీటిపై పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులును వివరణ కోరగా రోడ్లు, డివైడర్లు ఆర్అండ్‌బీ పరిధిలోకి వస్తాయన్నారు. వారు దీనిపై చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. తమ వరకు గ్రామ పంచాయతీ పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపడుతున్నామన్నారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్‌ను వివరణ కోరగా సమస్య తన దృష్టికి రాలేదని, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వెంటనే చెత్తాచెదారాన్ని తొలగిస్తామన్నారు.

నడిచేదెలా..?


బురదలో నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

పాఠశాలకు రావాలంటే.. బురద తొక్కాల్సిందే

పెనుకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానం వద్ద ఉన్న బురదను తొక్కి విద్యార్థులు పాఠశాలకు రావాల్సిందే. పట్టణంలోని ఆల్విన్‌కాలనీ, రైల్వేస్టేషన్, నాగులకట్ట, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాఠశాలకు రావడానికి క్రీడా మైదానం నుంచి దగ్గర దారి కావడంతో రోజూ వస్తుంటారు. క్రీడా మైదానం వద్ద పట్టణంలోని డ్రైనేజీ నీళ్లన్ని వెళ్లడంతో మురుగునీరు ప్రవహిస్తూ బురదగుంటగా మారింది. విద్యార్థులు ఈ బురదగుంటలో నడుచుకుంటూ పాఠశాల రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని డ్రైనేజీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న సీపీఐ నాయకులు

సోమందేపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి చెరువు నుంచి ఓ ప్రజాప్రతినిధి యథేచ్ఛగా మట్టిని తరలించడాన్ని గమనించిన సీపీఐ నాయకులు బాలస్వామి, గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. ఇరిగేషన్ డీఈకి ఫోన్ ద్వారా సమాచారం అందుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న డీఈ లక్ష్మీనారాయణ మట్టి తరలింపును నిలిపివేసి, హెచ్చరికలు జారీ చేశారు. శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారి వెళ్లిపోగానే మళ్లీ తవ్వకాలు జరిపి 20 ట్రాక్టర్లలో మట్టిని తరలంచారు. ఇదేమని అడిగితే అభివృద్ధి పనులకోసం అని తెలిపినట్లు సమాచారం. వ్యక్తిగతంగా లేక అభివృద్ధి పనులకైనా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంది. దీనిపై ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణను ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మారుతిని వివరణ కోరగా సమస్య తన దృష్టికి రాలేదన్నారు. వీఆర్‌ఓను సంఘటనా స్థలానికి పంపించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు.. పది మందికి గాయాలు

హిందూపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలం తూమకుంట చెక్‌పోస్టు గార్మెంట్ పరిశ్రమవద్ద ఆటోను బస్సు ఢీకొనడంతో పది మంది మహిళా కార్మికులు గాయపడినట్లు అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపారు. కర్ణాటక సరిహద్దు గౌరిబిదనూరు నాగసముద్రంకు చెందిన మహిళా కార్మికులు, మరికొంత మంది బీహార్‌కు చెందిన కార్మికులు తూమకుంటలోని టెక్స్‌పోర్టు గార్మెంట్‌లో పని ముగించకొని తిరిగు ప్రయాణంలో స్వగ్రామానికి వెలుతుండగా అదే కంపెనీకి చెందిన బస్సు వెనక నుంచి ఆటోను ఢీకొంది ఆటోలో ప్రయాణిస్తున్న మహిళా కార్మికులు గాయపడ్డారు. కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. నాగసముద్రానికి చెందిన ఆరుగురు మహిళలు గాయపడగా అందులో మమత అనే మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. బీహార్‌కు చెందిన మరో మహిళకు స్వల్పగాయాలయ్యాయి. ఆటోలు ప్రయాణిస్తున్న 10 మంది గాయపడినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


టీడీపీ కండువా వేసుకున్న వైసీపీ కార్యకర్తలు

లేపాక్షి, మార్చి18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు చేరారు. కంచిసముద్రం పంచాయతీ బసవనపల్లి గ్రామానికి చెందిన న్యాతరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామకిష్టప్ప, రామప్ప, జనార్దన్‌రెడ్డితో పాటు వారి కుటుంబాలు టీడీపీ కండువా కప్పుకున్నారు. మంగళవారం మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో నాయకులు ఈడిగ చంద్రశేఖర్ అధ్యక్షతన ఎమ్మెల్యే స్వగృహంలో వారు టీడీపీలోకి చేరారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

పెనుకొండ రూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్లాంపురం గ్రామంలో మూడు నెలల క్రితం రిటైర్డ్ టీచర్ ఆంజనేయులు హత్య కేసులో దళిత నాగరాజును అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు సీఐ రాఘవన్ మంగళవారం తెలిపారు. ఇస్లాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ ఆంజనేయులు తిప్పన్న అనే మహిళతో సహజీవనం సాగించేవాడు. మూడు నెలల క్రితం ఆయన హత్యకు గురయ్యాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. విచారణలో భాగంగా రిటైర్డ్ టీచర్‌తో సహజీవనం చేస్తున్న తిప్పమ్మ కొడుకు నాగరాజును అదుపులో తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

నాటు సారా నిర్మూలన అందరి బాధ్యత

● ఎక్సైజ్ సీఐ సృజన్ కుమార్


శెట్టిపల్లిలో మాట్లాడుతున్న సీఐ సృజన్ బాబు


పెనుకొండ, మార్చి18(ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలన అందరి బాధ్యత అని ఎక్సైజ్ సీఐ సృజన్‌కుమార్ అన్నారు. మంగళవారం శెట్టిపల్లి తండాలో నవోదయం 2.0 నాటు సారా నిర్మూలనపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ఎక్సైజ్ ఎస్ఐలు రాజశేఖర్, రాముడు, సర్పంచ్ సాయిరాంనాయక్, టీడీపీ కన్వీనర్ సిద్దయ్య, వీఆర్ఓ శంకర్, యానిమేటర్ జయలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలంలోని నాగియాని చెరువు తండాలో నాటుసారా నిర్మూలనపై ప్రజలకు ఎక్సైజ్ జిల్లా అధికారి గోవింద నాయక్ మంగళవారం అవగాహన కల్పించారు. నవోదయ 2.0 పేరిట నాటుసారా నిర్మూలనా కార్యక్రమాన్ని తండాలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తాగడంవల్ల కలిగే దుష్ప్రభావాలపై వివరించారు. సీఐ సృజన్ బాబు, ఎస్ఐ రాజశేఖర్, సర్పంచ్ అంజినాయక్, ఫారెస్ట్ అధికారి సుధాకర్, వీఆర్ఓ నాగరాజు, మహిళా పోలీస్ నాగజ్యోతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ

● అక్రమాలు జరిగినా వెలికితీయని బృందం
● జేబులు నింపుకున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

గుడిబండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద 2023-24 సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం తూతూ మంత్రంగా తనిఖీ చేపట్టి మమ అనిపించింది. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అడిషనల్ పీడీ శివశంకర్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తనిఖీ బృందం పంచాయతీ గ్రామాల్లో నిర్వహించిన పనులను పరిశీలించారు. గత వైసీపీ హయాంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన సిబ్బంది భారీ ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడి జేబులు నింపుకున్నారు. ఉపాధి హామీ సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఈసీ, ఏపీఓ ఉపాధి హామీ నిధుల స్వాహాకు వారికి సహకరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో తూతూ మంత్రంగా పరిశీలించి చేతులు దులుపుకుంది. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సామాజిక బహిరంగ సమావేశానికి కూలీలు ఒక్కరు కూడా హాజరుకాలేదు. సామాజిక తనిఖీ బృందం అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు. జంబలబండ గ్రామంలో రైతు పెంచిన మామిడి చెట్లలోనే చింతచెట్లు పెంచేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ఎంపిక చేశారు. చట్టవిరుద్ధమని తెలిసినా రికార్డులు తారుమారు చేసి నిధులను స్వాహా చేశారు. రోడ్డుకు ఇరువైలా అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కల పెంపకానికి భారీగా నిధులు ఖర్చు చేశారు. ఒక్క చెట్టు కూడా పెరగలేదు. దీంతో ఉపాధి నిధులు దుర్వినియోగమయ్యాయి. మండలంలో ఉపాధి హామీ పథకంలో 2023-24 సంవత్సరంలో రూ.7కోట్లు ఖర్చు చేయగా ఇందులో రూ.1,31,464 మాత్రం రికవరీ చేయడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి నిధులను వైసీపీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు భారీ ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడితే లక్షల్లో రికవరీ చేయడం ఎంతవరకు సమంజసం అని తనిఖీ బృందం అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఎంపీడీఓ గంగాధర్, ఎస్ఆర్‌పీ చంద్రమోహన్, సామాజిక తనిఖీ ఏఓ నాగేశ్వరరావు, ఏపీడీ లక్ష్మీనారాయణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సామాజిక తనిఖీ వేదిక


భక్తుల నడుమ కదులుతున్న రథం

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

చిలమత్తూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సోమఘట్టలో వెలసిన మధుగిరి లక్ష్మీనృసింహుని బ్రహ్మరథోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. కదిరి పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న బ్రహోత్సవాల్లో భాగంగా స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండే ఎండలను లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయంలో లక్ష్మీ, భూదేవిల సమేత నరసింహస్వామికి సుప్రభాత సేవతో ప్రత్యేక పూజలను ప్రారంభించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మరథాన్ని సిద్ధం చేశారు. ఉత్సవానికి ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రాంతంలో రథ సంప్రోక్షణ, పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ముందుగా నిర్ణయించిన ముహూర్త సమయానికి రథం ముందుకు కదిలింది. తరలివచ్చిన భక్తులకు అన్నదానం, మజ్జిగ, తాగునీటిని దాతలు అందజేశారు. స్వామి వారి బ్రహ్మరథోత్సవానికి హిందూపురం నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన వెంట బేవనహళ్లి ఆనంద్, మంజునాథ్, మంగేష్, పరిమళ తదితరలతో పాటు స్థానిక నాయకులు తిప్పారెడ్డి, రంగారెడ్డి, నాగరాజుయాదవ్ పాల్గొన్నారు.

అన్ని చెరువులకు నీరిస్తాం: టీడీపీ


హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హిందూపురం, లేపాక్షి మండలాల్లో హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులన్నిటికీ నీరందిస్తామని టీడీపీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం రాచిపల్లి వద్ద హంద్రీనీవా కాలువను ఇరిగేషన్ అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అన్ని చెరువులకు నీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల కాలువల్లో కంపచెట్లు పెరిగిపోయాయని, గత ఐదేళ్లలో కాలువలకు నీరు వదలకపోవడంతో ఈ పరిస్థితి ఉందన్నారు. వీటిని త్వరలోనే తొలగిస్తామన్నారు. వీరివెంట వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవినహళ్లి ఆనంద్, మంగేష్, సర్పంచ్ మంజునాథ్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

హిందూపురం	ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.10
పెనుకొండ	ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.10
	(బుధవారం సాయంత్రం)	(గురువారం ఉదయం)

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

హిందూపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ఇంటి ముందు చెత్త ఊడుస్తున్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కొని వెళ్లిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. సువర్ణమ్మ అనే వృద్ధురాలు ఇంటి ముందు చెత్త ఊడుస్తుండగా ద్విచక్రవాహనంలో వచ్చిన గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలోని 35 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని వెళ్లిపోయారు. ఆమె వెంటనే తేరుకొని కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు, బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

తేలుకాటుతో విద్యార్థికి అస్వస్థత

పెనుకొండ రూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లి ఎంపీపీ పాఠశాలలో చదువుతన్న మణికాంత రెడ్డి అనే విద్యార్థి తేలుకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన మేరకు అదే గ్రామానికి చెందిన హనుమంత రెడ్డి, రూపా దంపతుల కుమారుడు మణికాంత రెడ్డి ఎంపీపీ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. రోజూలాగే మంగళవారం పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థి ప్యాంటులోకి తేలు దూరింది. తేలు కదలిక విద్యార్థి గమనించకపోవడంతో మూడుసార్లు కాటువేసింది. విద్యార్థి గట్టిగా కేకలు వేశాడు. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారు. విద్యార్థిని పరిశీలించగా ప్యాంటులో తేలు వుండటంతో అవాకయ్యారు. ప్రథమ చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. పాఠశాలలో అపరిశుభ్రంగా వుండటంతో ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

బైక్ దొంగల అరెస్టు

పెనుకొండ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణమ్మ కాలనీ సమీపంలో జనవరి 21న ద్విచక్ర వాహనం దొంగిలించిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వరులు తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీరు పచావర్, సత్యదుడ్వి, సునీల్ చవాన్‌లుగా గుర్తించామన్నారు. వీరిని మంగళవారం కోర్టుకు హాజరుపరిచామన్నారు. పెనుకొండలో ద్విచక్రవాహనం చేశారు. వీరే అనంతరం ఫిబ్రవరి 9న అనంతపురం రాజహంస విలాస్ ప్రాంతంలో చోరీ చేశారన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా.. ఒకరికి గాయాలు

గోరంట్ల, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెంగళూరు రహదారిపై బూదిలి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం బోల్తాపడిన ఘటనలో అశోక్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. గుమ్మయ్యగారిపల్లికి చెందిన క్రిష్టారెడ్డి కుమారుడు అశోక్‌కుమార్‌రెడ్డి కూడలిలో దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణానికి అవసరమైన సరుకులు కొనుగోలు చేయడానికి మంగళవారం కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో అశోక్‌కుమార్‌రెడ్డి అపస్మాకర స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించరు. గోరంట్ల చికిత్సలు అందించి మెరుగైన వైద్యంకోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

గోరంట్ల, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్లాలచెరువు వద్దనున్న కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్న అర్చన అనే మహిళ కనిపించకపోవడంతో మంగళవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. సోమందేపల్లి మండలం వెలగమాకులపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహులు కుమార్తె అర్చనకు చిలమత్తూరు మండలంలోని తిమ్మారెడ్డిపల్లికి చెందిన సత్యనారాయణతో వివాహం జరిగింది. వారి మధ్య విభేదాలు రావడంతో ఏడాది క్రితంనుంచి ఆమె పుట్టింట్లో ఉంటున్నట్లు తెలిపారు. స్వగ్రామంలో ఉంటూ జేజేఐ పరిశ్రమలో పనిచేస్తుండేది. తండ్రి సోమవారం పరిశ్రమ వద్దకు ద్విచక్రవాహనంలో ఉదయం వదిలిపెట్టి వెళ్లాడు. అనంతరం ఆమె ఇంటికి రాకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదుచేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.